# అల్లరి మాన్పించిన పెట్టె

శ్రీ జి. వి. జి. కృష్ణ



సూళ్లూరు పేట బోర్డు హైస్కూల్‌లో శివరామయ్యగారనే మేస్టారు పనిచేస్తూండేవారు. ఆయనకు లేక లేక కల్గిన కొడుకు వేణు.

వేణూకి ఏడేనిమి దేళ్లుంటాయ్. ఇంట్లో ఎప్పుడూ ఏదో ఒక అల్లరి చేస్తూంటాడు. వాడి చేతులూ కాళ్లూ ఒక్క క్షణమైనా వూరికే వుండవు.

సైకిల్ ట్యూబ్లలోనించి వాళ్ల నాన్న గాలి తీసెయ్యడం ఎన్నడో చూశాడు వేణు. ఒకనాడు వాళ్ల నాన్న ఏదో అర్జంటు పనిమీద బయటికి వెళ్లటానికి సైకిల్‌ను చూసుకుంటె, రెండు ట్యూబ్లులోనూ గాలి ఖాళీ! ఇక అంతే-వేణూ గాడి వీపు విమానంమోత మోగిపోయింది.

ఎన్ని దెబ్బలు తలిగినా, వేణూ మాత్రం వాడి చిలిపిచేష్టలు మానలేదు! ఇంకోరోజు వాళ్లనాన్న ఎవరో స్నేహితుడి ఇంటికి వేణూని పిల్చుకుని వెళ్లి, ఆ స్నేహితుడితో మాట్లాడుతూ కూర్చొనివుంటే, వేణూ ఎప్పుడు వెళ్లాడో ఏమో కానీ- అక్కడ మేజామీద ఓ గడియారం వుంటే దాన్ని కాస్తా తిప్పి తిప్పి చెడగొట్టేశాడు ఆ వేళ వేణూని కొట్టినట్లు, వాళ్లనాన్న ఏస్కూలులోనూ ఏ విద్యార్థిని కొట్టలేదు.

ఏదయినా కొత్తవస్తువు వేణూ కళ్ల పడిందంటే చాలు, అదేమిటో, లోపల ఏముందో పరీక్ష చేసి, దాన్ని ఏదో ఒహాటి చేసేంత వరకూ నిద్రపట్టేది కాదు వేణూకి.

ఎండాకాలం శెలవల్లో వేణూ వాళ్లనాన్న సంసార సమేతంగా మద్రాసుకు బయలుదేరి వచ్చారు. పనిలో పనిగా ఒకరోజు సినిమా షూటింగు చూడటానికి, ఏదో ఓ స్టూడియోకు భార్యనూ కొడుకునూ పిలుచుకొని వెళ్లారు, శివరామయ్యగారు.

ఆరోజు ఆ సెట్‌లో ఎవరో ఒక మంత్రగాడి సీను షూట్ చేయబోతూన్నారు. ఆ మంత్రగాడు చక్కగా ముస్తాబై, నిలువుటద్దం ముందు నిలుచొని మీసమూ గడ్డమూ ఓమారు సవరించుకొని, మూలనున్న "ఓ పెద్ద పెట్టెవద్దకు వెళ్ళి రాజకుమారీ!...ఇప్పటికైనా నన్ను పెళ్లాడటానికి ఒప్పుకో. తక్షణమే నిన్ను బందిఖానా నించి విడుదల చేయిస్తా. నన్ను పెళ్ళాడి సుఖంగా వుండొచ్చు ఏమంటావు, బుల్ బుల్?" అని అడుగుతాడు. ఆ పెట్టె నించి ఏ జవాబూ రాదు.

జవాబు ఎందుకు రాదంటే, ఆ క్రితం రాత్రే కథానాయకుడు మాయపల్లకిలో దొంగతనంగా అక్కడికి మారువేషంలో వచ్చి, రాజకుమారిని ఆ పెట్టెలోనించి విడిపించి, తనతో కూడా తీసుకొని వెళ్ళిపోతాడు. ఆ సంగతి యీ మంత్రగాడికి యింతవరకూ తెలియదు.

ఇప్పుడు, ఎంతసేపటికీ పెట్టె నించి జవాబు రాకపోయేసరికి, ఆ మంత్రగాడు విసుగెత్తి కోపంతో "ఏయ్ ధగిడీ!...బదులివ్వవేమే?" నని దఢీలున ఆ పెట్టె తెరుస్తాడు. అందులో రాజకుమారి వుండదు. మంత్రగాడు తెల్లబోయి కోపంతో పళ్లు పటపటా కొరుకుతాడు. అంతే-అంతటితో ఆ షాటు ఐపోతుంది. అదేవాళ్లు ఆ వేళ షూట్ చేయబోతున్న దృశ్యం.

షాటుకు అంతా సిద్ధం చేసుకుంటున్నారు. ఓ వైపున డైరెక్టరుగారు ఆ మంత్రగాడి పాత్రధారి చేత డైలాగులు రిహార్సు చేయిస్తూంటే, మరోవైపున కామెరా

మెన్ ఆమంత్రగాడి డ్రస్సింగ్ టేబిల్ మీద లైటింగ్ అరేంజి చేస్తున్నాడు.

కంటిమీద రెప్ప వాల్చకుండా అందరూ ఆ సెట్ వంక గుడ్లప్పగించి చూస్తూంటే, మన వేణుమాత్రం తాను రిపేర్ చేయటానికి, కొత్త వస్తువులు అక్కడ ఏమైనా వున్నాయేమోనని అటూ ఇటూ గాలిస్తూన్నాడు. కొద్ది దూరంలో ఓమూల ఓ పెద్ద పెట్టె కనిపించింది.



అందరూ షూటింగులో మునిగిపోయి వుండటం చూసి, వేణూ, యిదే మంచి సమయమని మెల్ల మెల్లగా అడుగులు వేస్కుంటూ ఆ పెట్టె దగ్గరికి ఖెళ్లి, అలా చూశాడు. ఆ పెట్టెమీద అంతటా సిగరెట్ పెట్టెలలో వుండే, కాకి బంగారపు కాగితాలతో తమాషాగా అంటించి పెట్టారు.

ఎవరైనా చూస్తున్నారేమోనని ఓమారు ఇటూ అటూ చూసి, తర్వాత మెల్లగా పెట్టె తెరిచాడు అందులోనూ ఏమీ లేదు. వేణూ నిరాశతో పెద్దగా నిట్టూర్చాడు.

ఏం చేయటానికీ తోచక, ఆలోచనలో పడిపోయాడు. ఏదో ఒహ చిలిపిచేష్ట చేయనిదే, అక్కడ్నించి కదలటానికి మన సొప్పదు. అంచేత నోరు పేద్దగా తెరిచి ఆవులిస్తూ, వెనక్కి తిరిగి అమ్మానాయనకేసి చూశాడు. వాళ్లు తదేక దృష్టితో సెట్టువంక చూస్తున్నారు.

ఉన్నట్లుండి వేణూ బుల్లిబుర్రలో చప్పున ఒక ఆలోచన మెరిసింది. తనకోసం అమ్మా నాన్నా వెతుక్కునేటట్లు చేసి, వాళ్లను కాస్సేపు ఎందుకు ఏడ్పించకూడదూ అని!

అనుకోవటమే తరువాయిగా, చెంగున ఆ పెట్టిలో కెగిరి కూర్చుని, ఠపీమని తలుపు మూసుకున్నాడు. ఆ అదురుకు ఆ పెట్టెమీది గొళ్లెం కాస్తా పడిపోయింది.

పావుగంటయింది ... అర్ధగంటయింది... వేణు కాళ్లు ముడుచుకొని ఆ పెట్టిలో ఆలాగే కూర్చునున్నాడు. లోపలంతా చీకటి. గాలి ఆడక ఉక్కిరి బిక్కిరియై పోతున్నాడు. ఆ పెట్టెవద్దకు ఎంతసేపటికీ, ఎవ్వరూ రాకపొయ్యేసరికి వేణూకు విసుగుపుట్టి, తనకోసం వాళ్లక్కడ వెదుక్కుంటున్నారో లేదో తమాషా చూడటానికి పెట్టె తెరవబోయాడు. కానీ తలుపు వస్తే

(41-వ పేజీ చూడండి)

# ★ అల్లరిమాన్పించిన పెట్టె ★

(35-వ పేజీ తరువాయి)

కదూ? పైన గోళ్లెం పడిపోయిన సంగతి వేణూకు తెలియదాయె! వాడికి ఎక్కడలేని గాభరా పుట్టుకొచ్చేసింది. ముచ్చెమటలు పోసినై. "అమ్మోవ్...నాయనోవ్" అని ఆపెట్టెనుంచే అరవటం మొదలెట్టాడు. అక్కడ దగ్గర ఎవరైనా వుంటేగా వేణూగోడు వినేందుకు? షూటింగ్ సందడిలో ఎక్కడో దూరంగా వున్నవారికి, ఇక్కడ పెట్టెలోంచి, వేణూ పెట్టే కేకలు ఎలా వినపడ్తాయ్?

కొద్దిసేపటికి అక్కడ వేణూ కనిపించక వాళ్లమ్మా, నాన్నా దిగులుపడి అక్కడంతా వెదకటం మొదలెట్టారు. అక్కడెక్కడా కూడా వేణూ కనిపించకపోయేసరికి, వాళ్లకు ఎక్కడలేని భయం వేసింది. వాళ్లు ఎవరి సలహాఖూదనో, స్టూడియో ఆఫీసువద్దకు గబగబా వెళ్లి, అక్కడి టెలిఫోన్ ద్వారా పోలీసు స్టేషనుల కన్నిటికీ రిపోర్ట్ యిచ్చారు. అక్కడ్నించే పత్రికా కార్యాలయాలకు కూడా ప్రకటనలు పంపించారు-ఇలా ఎనిమిదేళ్ల బ్బాయ్, వేణూ అనేవాడు, తప్పించుకు పోయాడనీ, ప్రింటెడ్ లినెన్ బుష్‌కోట్, పైజామా తొడుక్కొని వుంటాడనీ, కుడిబుగ్గమీద పెద్ద మచ్చవుంటుందనీ, దొరికినవారికి నూటపదహార్లు బహుమతి యిస్తామనీ!

శివరామయ్యగారు అన్ని పత్రికలకూ ప్రకటనలు పంపించిన తర్వాత ఆస్టూడియోలో అంతా వెదకటానికి బయలుదేరారు. వేణూవాళ్లమ్మ ఏడుస్తూ ఆయనతో కూడా తిరుగుతోంది.

ఇక్కడ పెట్టెలో అరిచీ అరిచీ వేణూగొంతు నొప్పెట్టుకుంది. దభదభా పెట్టెను గుద్ది శబ్దం చేద్దామనుకున్నాడు. కాని ఇరుకుగా వుంది. కాళ్ల సందులలో ముడుచుకొని వున్న చేతులను విడిపించుకోలేకపోయాడు. కాస్సేపటికి వేణూ బాగా అలిసిపోయి, ఆచీకటి పెట్టెలో వెక్కి వెక్కి ఏడుస్తూ, కొద్దిసేపటికి అలానే కళ్లు మూశాడు.

అక్కడ సెట్టులో - ఆమంత్రగాడు డ్రెస్సింగ్ టేబిల్ ముందు ముస్తాబు చేసుకునే పాటు అయిపోయింది. ఇప్పుడు ఆ మంత్రగాడు ఇక్కడ మూలనున్న [వేణూ వున్న] పెట్టెవద్దకు వచ్చి డైలాగులు చెప్పాలి.

"ఆల్ లైట్స్ ఆన్" అని అరిచాడు కామెరామెన్.

"సైలెన్స్ - ఏస్ ... టేక్" అన్నాడు డైరెక్టరు.

కామెరా స్విచ్ ఆన్ ఐంది. మంత్రగాడు మీసం తిప్పుతూ, దర్జాగా అడుగులు వేస్కుంటూ ఆపెట్టెవద్దకువచ్చి, బొంగురు గొంతుకతో "రాజకుమారీ! ఇప్పటికైనా నన్ను పెళ్లాడ్తానను...తక్షణమే నిన్ను బందిఖానానించి విడుదల చేస్తా. నన్ను పెళ్లాడి సుఖంగా వుండొచ్చు! ఏమంటావు నా బుల్ బుల్?" అన్నాడు.

ఆపెట్టెనించీ జవాబు రాకపోయేసరికి, ఆమంత్రగాడు కోపంతో "ఏయ్ ధగిడీ... నామాటకు బదులివ్వవేమే?" అని తటాలున పెట్టెను అలా తెరిచాడో లేదో, "అమ్మా" అని గావుకేకలు పెట్టుతూ పెట్టెలోనుంచీ ఊడిపడ్డాడు వేణు ఏమీ వుండదనుకొన్న పెట్టెనుంచీ అమాంతంగా ఏదో ఎగిరి దూకటం చూసి, ఆమంత్రగాడి పాత్ర వేసిన ఆయన, తనమీద దూకింది ఏభూతమో దయ్యమో నని భీతిల్లి, స్పృహతప్పి అక్కడే మూర్ఛపడిపోయాడు.

డైరెక్టర్ "కట్ కట్" అని పొలికేక పెట్టాడు. కామెరామెన్ "లైట్స్ ఆఫ్" "లైట్స్ ఆఫ్" అన్నాడు. కామెరా స్విచ్ ఆఫ్ అయింది. ఆపాటు చెడి అంతా రసాభాస అయిపోయింది. సెట్‌లో కలవరం బయలుదేరింది. కొంతమంది ఆ మాంత్రికుని పాత్రధారి వద్దకు గలగలా పరుగెత్తుకొని వచ్చి, అతని మొహం మీద నీళ్లు చల్లి శైత్యోపచారాలు చేయటం మొదలెట్టారు.

కొందరు వేణూవంక తెల్లబోతూ చూస్తున్నారు. కళ్లవెంబడి నీళ్లు కారుస్తూ అక్కడ అమ్మా నాన్నకోసం చూస్తున్న వేణూ దగ్గరికి, డైరెక్టర్ గారు వెళ్లి "ఆపెట్టెలోకి ఎలా వెళ్లావబ్బాయ్" అని అడిగారు. "అమ్మా! అమ్మా!" అని ఏడవటం తప్పించి, ఇంకేమీ చెప్పలేకపోయాడు వేణు.

ఈసంగతి అప్పుడే ఆ స్టూడియోలో అంతటా వ్యాపించిపోయింది. ఎక్కడో ఆ స్టూడియోలో మారుమూల, ఏడుస్తూ వేణూ

# ★ సుందరి ★

(37-వ పేజీ తరువాయి)

ఉండేది. ఆమె ఇబ్బందులు పడుతూంటే చూసిన వాళ్లందరికీ కళ్లు చెమ్మగిలేవి. కొంతమంది జమీందారులు ముందుకువచ్చి ఆమెను వివాహం చేసుకోవాలని ఉవ్విళ్లూరారు. అయినా సుందరి ససేమిరా అని చెప్పి తండ్రికిఅన్నిపనులలోను ఆసరాగా ఉంటూండేది. పాపం సుందరి మొట్టమొదట తనకువచ్చిన కష్టాలు భరించలేక కళ్లమ్మట నీళ్లు పెట్టుకొనేది. కాని కొంత కాలానికి "కళ్లమ్మట నీళ్లు పెట్టుకుని లోలోపల కుములుతూ కూర్చుంటే ఏమి లాభం! ఎల్లాగో అల్లాగ ఉన్న దానితో తృప్తిపడి సుఖంగా కాలక్షేపం చెయ్యాలి." అని సమాధాన పడింది. అప్పటినించి తండ్రికి అనేకవిధాల సాయపడుతూ ఎంతో సంతోషంగా కాలక్షేపం చేస్తూండేది.

ఆపల్లెటూరికి మారినప్పటినించీ ధనగుప్తుకీ కొడుకులు ముగ్గురు తమ ఇంటిదగ్గిర ఉన్న పొలం అంతా దున్ని అన్ని ఫలవృక్షాలు గల ఒక పెద్దతోట పెంచారు. పొద్దున్న, సాయంత్రం ఆతోటలోని ఫలవృక్షాలకన్నింటికి ఏతాంతోలి నీరు పెట్టేవారు.

సుందరి ప్రతిరోజూ తెల్లవారగట్లే లేచి ఇల్లంతా తుడిచి శుభ్రం చేసి తండ్రికి, అన్నలకు, అక్కలకు ఎంతో ఆప్యాయంగా అన్నం వండి పెట్టి, విసుక్కోకుండా పని అంతా తానొకర్తే చేస్తూండేది. అంతగా అలవాటు లేకపోవడం మూలాన్ని మొదట్లో ఆమె కిది అంతా కొంత కష్టంగానే ఉండేది గాని అలవాటయినకొద్దీ అదే హాయి అనిపించింది.

ఇల్లాగ ఇంటిపని అంతా పూర్తి చేసిన తరవాత మధ్యాహ్నం తెరిపగా ఉన్నప్పుడు చదువుకుంటూ కాలక్షేపం చేసేది.

ఇంక అక్కలిద్దరికీ మరి ఆ పల్లెటూళ్లో కాలక్షేపం అయేదేకాదు. అసలు లేవడమే పొద్దున్న పదిగంటలకి లేచేవారు. ఆపైన ఆవలించడం ఒక అరగంట పట్టేది! లేచి కాస్త అటూ ఇటూ తిరిగేసరికి అలిసిపోయి మళ్లీ తమ పరుపులమీదే కూలబడిపోయేవారు. మధ్యాహ్నం అంతా గుర్రుపెట్టి నిద్రపోయి, సాయంత్రం అయ్యేసరికి తోటలో ఒక చెట్టుకింద కూర్చుని తమకింక నగలు, సిలుకు చీరలు లేవుగదా అని ఆలోచిస్తూ దిగులుగా ఉండేవారు. చెల్లెలు ఉన్నవాటితోనే తృప్తిపడి సుఖంగా ఉండంచూసి రుసరుస లాడుతూ ఆమె కంటబడేసరికి పెడమొహం పెట్టుకొని కూర్చునేవారు. అస్తమానము అయినదానికీ కానిదానికీ ఆమెను సాధించిపోస్తూ ఊరికే ఉత్త పుణ్యానికి శాపనార్థాలు పెడుతూండేవారు. ఇన్ని చేసినా సుందరి ఏమీ అనక నెమ్మదిగా తనపని తను చేసుకుపోతూండేది.

ఇల్లాగ ఆ పల్లెటూళ్లో ఒక సంవత్సరం గడిచిపోయింది. ఒకనాడు హఠాత్తుగా ధనగుప్తుడికి ఒక ఉత్తరం వచ్చింది. ఆఉత్తరం చదివేసరికి అతనికెంతో ఉత్సాహం కలిగింది. మునిగిపోయాయనుకున్న ఓడలు మునిగిపోలేదని అవి అన్నీ సురక్షితంగా రేవులోకి వచ్చాయనీ ఆఉత్తరంలో ఉంది. ఈసంగతి తెలియగానే అక్కలిద్దరు ఎగిరి గంతేశారు. మళ్ళీ చీరలు సింగారించుకుని కులుకుతూ సుఖంగా ఉండవచ్చుననీ హాయిగా పెళ్లిళ్లు చేసుకుని అత్తవారింటికి వెళ్లవచ్చునని ఉబలాటపడ్డారు.

ధనగుప్తుడు ఓడలు చూడడానికి బయలుదేరుతూంటే అక్కలిద్దరు అతని దగ్గిరికి వెళ్ళి వెంటనే తమకు సరికొత్త చీరలు, నగలు తీసుకు రావలిసిందని అడిగారు. సుందరి మాత్రం పుస్తకం ఏదో చదువుకుంటూ కూర్చుంది.

ధనగుప్తు డామెదగ్గిరికి వచ్చి "అమ్మా మనఓడలు చూడడానికి వెడుతున్నాను. తిరిగి వచ్చేటప్పుడు

---

## అల్లరిమాన్పించిన పెట్టె

కోసం వెతుకుతున్న, శివరామయ్యగారికీ, ఆయన భార్యకీ పిల్లవాడు దొరికాడని తెలిసింది. వాళ్లు ఒక్క పరుగున అక్కడికొచ్చి వేణుని అమాంతంగా ఎత్తుకున్నారు. వేణు వాళ్లమ్మ ఇంకా ఏడుస్తూనే వుంది. "ఎక్కడికెళ్లావురా నాతండ్రీ?" అని ఆమె వెక్కి వెక్కి ఏడుస్తూ అడిగితే, అంతకంటె బిగ్గరగా ఏడ్చాడు వేణు.

ఇది జరిగి ఇప్పటికి చాలా రోజులైందనుకోండి - చెప్పొచ్చేదేమిటంటే ఆదెబ్బతో వేణుకు బుద్ధి వచ్చి, అల్లరి పనులు మానేశాడు. ★